క్లుప్తంగా

ఓటమే విజయానికి తొలిమెట్టు



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఎస్ఐ ఖాజాహుస్సేన్

పెద్దపప్పూరు: క్రీడల్లో ఓటమే విజయానికి తొలిమెట్టు అవుతుందని ఎస్ఐ ఖాజాహుస్సేన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడినవారు గెలిచిన వారిని ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో కృషిచేస్తే తప్పక విజయం వరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

గుంతకల్లు రూరల్: శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వీకేర్ హెల్త్ క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన యువతీ యువకులు అర్హులని, ఆసక్తి కలిగిన వారు తమ బయోడేటా, ఇతర సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

యల్లనూరు ఎంపీడీఓగా వీరరాజు



యల్లనూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓగా వీరరాజు గురువారం నూతన బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి ఈఓఆర్డీగా పని చేస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి బాటలో నడుపుతానన్నారు. కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రీసర్వేతో రైతుల భూములకు రక్ష



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష కార్యక్రమంతో రైతుల భూములకు పూర్తి రక్షణ ఏర్పడనుందని తహసీల్దార్ రాము పేర్కొన్నారు. గురువారం తిమ్మాపురంలో రీసర్వే ప్రారంభిస్తున్న నేపథ్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ప్రతి ఒక్కరూ దగ్గరుండి రీసర్వే చేయించుకోవాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సైతం పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.

పేదలకు న్యాయం చేయాలి

గుంతకల్లు రూరల్: పామిడిలో గుడిసెలను పోగొట్టుకున్న పేదలకు తక్షణమే న్యాయం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పామిడిలోని సర్వే నెంబర్ 1లో ఉన్న గుట్ట పోరంబోకు భూమిలో అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో 80 మంది గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. బుధవారం రెవెన్యూ అధికారులు గుడిసెలు తొలగించారన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యత



పిల్లలు వేసిన డ్రాయింగ్ ప్రదర్శిస్తున్న దృశ్యం

గుత్తి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పిల్లలు వేసిన డ్రాయింగ్‌ను పరిశీలించారు. సమ్మర్ క్యాంప్ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. గ్రంథాలయాధికారి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా కష్ట పడి ఉన్నత చదువులు చదవాలన్నారు. సమ్మర్ క్యాంప్ చాలా బాగా జరుగుతున్నదని గ్రంథాలయాధికారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, గుంతకల్లు, కళ్యాణదుర్గం గ్రంథాలయాధికారులు కంబన్న, శ్రీనివాసులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, పిల్లలు పాల్గొన్నారు.

సామాజిక సేవే సత్యసాయి ట్రస్టు లక్ష్యం



సత్యసాయి విగ్రహానికి పూజలు చేస్తున్న ఆర్‌జే రత్నాకర్, సభ్యులు



సత్యసాయి విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: సామాజిక సేవే తమ లక్ష్యమని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. సత్యసేవాసమితి ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా తాడిపత్రి శివాలయం వీధిలో నూతంగా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన సత్యసాయి మందిరం, స్వామి విగ్రహ ప్రతిష్ట, సత్యసాయి లక్ష్మీనారాయణస్వామి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఉచిత మహిళల టైలరింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన ట్రస్టు సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో సత్యసాయి విగ్రహానికి పూజలు నిర్వహించారు. మందిరాన్ని, సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్ గదులను ఆయన పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రత్నాకర్ మాట్లాడుతూ తాడిపత్రిలో 2014లో గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం 2014లో సత్యసాయి లక్ష్మీనారాయణస్వామి వృత్తి విద్యార్థుల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ప్రారంభంలో కేవలం 8 మంది గ్రామీణ నిరుద్యోగ యువకులతో శిక్షణ ప్రారంభించామని, ప్రస్తుతం 17 బ్యాచుల్లో 150 మంది నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతోపాటు వసతి కల్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు సేవాగుణం అలవర్చుకోవాలని, సంపాదనలో కొంత మేరకు దానధర్మాలు, సేవకు వెచ్చించాలని సూచించారు. ప్రేమ, శాంతి, మానవత్వం, అహింస, సత్యసాయి మార్గాలను ఆచరించడం అలవర్చుకోవాలన్నారు పుట్టపర్తి తర్వాత తాడిపత్రిలో అతిపెద్దగా సత్యసాయి మందిరం నిర్మించడం హర్షణీయన్నారు. తాడిపత్రి రెండో ప్రశాంతి నిలయంగా నిలిచిందని, భక్తులందరూ స్వామిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు నిమిష్‌పాండే, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి, సత్యసాయి సేవా సమితి తాడిపత్రి కోర్డినేటర్ గంగాధర్, కన్వీనర్ రత్నమయ్య సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పూజలు

స్థానిక శివాలయం వీధిలో సత్యసాయి మందిరం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజర్యారు. ఎమ్మెల్యేకు సత్యసాయి సేవా సమితి సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే సత్యసాయి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: శింగనమల నియోజకవర్గంలోని 45 మైనర్ ఇరిగేషన్ చెరువులకు హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్చెల్సీ ద్వారా 1.35 టీఎంసీల నీటిని తాగు, సాగునీటికి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుత్తి రూరల్: యంగన్నపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి గురువారం తెలిపారు. ప్రజాప్రతినిధులు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని బస్టాండు నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

అండర్ డ్రైనేజీ పనులకు భూమి పూజ



అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక సీపీఐ కాలనీ సమీపంలో అండర్ డ్రైనేజీ ఎస్‌టీపీ-1 మరమ్మతు పనులకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి భూమి పూజ చేశారు. కొద్ది రోజులుగా అండర్ డ్రైనేజీ దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పందించి మరమ్మతు పనులకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక సంజీవనగర్‌కు చెందిన బలిజ సంఘం పట్టణ మాజీ ఉపాధ్యక్షుడు చింతామణి వెంకటనారాయణ ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గురువారం వెంకటనారాయణ ఇంటికి చేరుకుని ఆయనను పరామర్శించారు. వెంకటనారాయణ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

జగనన్న కిట్లు, పాఠ్య పుస్తకాల అందజేత



జేవీకే కిట్లను తరలిస్తున్న ఎంఈఓ కాశెప్ప

యాడికి: స్థానిక నం:1 ప్రాథమిక పాఠశాలలో గురువారం జగనన్న కిట్లు, పాఠ్య పుస్తకాలను మండలంలోని 35 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈఓ కాశెప్ప అందజేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 3,996 మంది విద్యార్థులకు జేవీకే కిట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్ యూనిఫాం, సాక్స్‌లు, షూ, బెల్ట్ నిఘంటువులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు విద్యా కానుకల తరలింపునకు రవాణా చార్జీలను సైతం ప్రభుత్వమే చెల్లిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఐఈఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థితో పీడీ గోపాల్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: మినీ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ టోర్నీలో బీకేఎస్ విద్యార్థి ప్రతిభ కనబరిచారని బీకేఎస్ హైస్కూల్ పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు అనంత క్రీడా ఆర్డీటీ మైదానంలో మినీ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ టోర్నీ జరిగిందని, 12 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఏపీ అండర్-11 బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఈ జట్టులో బీకేఎస్ హైస్కూల్‌కు చెందిన రాజు ప్రాతినిధ్యం వహించి అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర, పీడీ గోపాల్‌రెడ్డి అభినందించారు.

విత్తన పంపిణీ పక్కాగా చేపట్టండి



వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ అన్వేష్‌కుమార్

శింగనమల: వేరుశనగ విత్తన కాయల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని ఏఓ అన్వేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని రాచేపల్లి, సలకంచెరువు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల నాణ్యతను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనకాయలతోపాటు ఎరువులు అందించాలన్నారు. రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 1,610 మంది రైతులకు 1,304 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేసినట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: పాళ్యం రైతుభరోసా కేంద్రంలో సర్పంచ్ రామాంజనేయులు గురువారం రైతులకు విత్త వేరుశనగ పంపిణీ చేశారు. నాణ్యతతో కూడిన విత్తనకాయలు అందిస్తున్నామని సర్పంచు తెలిపారు. వీఏఏ రాధ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతుడు ప్రణీత్(ఫైల్)

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి ప్రణీత్(21), తన స్నేహితుడు కిశోర్‌తో కలిసి బైక్‌పై కొత్తపేట వైపు నుంచి గుత్తిలోకి వస్తుండగా కోట వీధికి చెందిన మహేష్ అనే యువకుడు మరో బైక్‌లో ఎదురుగా వచ్చి ఢీ కొన్నాడు. దీంతో మహేష్‌తో పాటు ప్రణీత్, కిశోర్ రోడ్డుపై ఎగిరిపడ్డారు. గుత్తి వైపు వెళుతున్న లారీ ప్రణీత్ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కిశోర్, మహేష్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రణీత్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటనా స్థలాన్ని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐలు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు పరిశీలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధాశ్రమంలో వస్త్రదానం



వృద్ధులకు వస్త్రదానం చేస్తున్న కేతిరెడ్డి సాయి ప్రతాప్ రెడ్డి, కేతిరెడ్డి మౌనికా రెడ్డి దంపతులు

యాడికి: రాయలచెరువు గ్రామంలోని నీలావతి వృద్ధాశ్రమంలో గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మనుమరాలు, కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి, మౌనికా రెడ్డి కుమార్తె దక్ష అన్న ప్రాసన సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు క్రిష్ణవేణి, విక్రమనాయుడు తెలిపారు. ఈసందర్భంగా కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి, మౌనికారెడ్డికి ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాయలచెరువు పీహెచ్‌సీలో కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి 40 మంది గర్భిణులకు భోజనవసతి కల్పించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు అప్పయ్య, దేవరాజన్ తెలిపారు.

నగరూరులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తి ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అప్పయ్య

యాడికి: నగరూరు గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందించారు. రోగులకు బీపీ, షుగర్, పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. గర్భిణులను పరీక్షించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇంటింటికీ తిరిగి మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులు, బాలింతలను పరీక్షించారు. 104 వద్దకు వచ్చిన దాదాపు 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పయ్య, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి గాయాలు

యల్లనూరు: మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా గురువారం ఓ మహిళా కూలీకి తీవ్రగాయాలయ్యాయి. మండలకేంద్రానికి చెందిన శనగల వరాలు పని చేస్తుండగా గునపం చేతిపై పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను తోటి కూలీలు తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

తాడిపత్రి టౌన్: యర్రగుంటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 10 మంది వృద్ధులను కంటి ఆపరేషన్లను ఎంపిక చేసినట్లు కంటి వైద్యాధికారి మధుసూదనరాజు తెలిపారు. సర్పంచ్ యుగంధర్, చుక్కలూరు వైద్యాధికారి లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: జక్కలచెరువులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గంగయ్య అనే వ్యక్తి గ్రామంలో బెల్టు షాపును ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ వెంకటరామిరెడ్డి, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గంగయ్య ఇంట్లో సోదాలు నిర్వహించి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దవడుగూరు మండలం బందార్లపల్లికి చెందిన పెద్దిరెడ్డి అనే వ్యక్తి పని నిమిత్తం గుత్తి వచ్చి అనంతరం తాడిపత్రికి బైక్‌పై బయలుదేరాడు. కొత్తపేట వద్ద తాడిపత్రి వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్లూరు మండల సర్వేయర్‌గా శాంతి

పుట్లూరు: తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా శాంతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనంతపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె గ్రామ సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

గుత్తి రూరల్: పట్టణంలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహబూబ్‌బాషా హెచ్చరించారు. గురువారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ మాట్లాడుతూ పట్టణంలోని కర్నూలు రోడ్డులో సర్వే నంబర్ 565లో భూమిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తు కబ్జా చేసి అక్రమంగా రాళ్ల పాతినట్టు తమకు తెలియగానే అడ్డుకున్నామన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసేవారు ప్రభుత్వ సెలవు దినాలు, రాత్రి సమయాల్లో అక్రమంగా రాళ్లు పాతి క్రయవిక్రయాలు చేసుకుంటున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

రోడ్లు నాణ్యతతో నిర్మించాలి

పామిడి: పట్టణంలో నిర్మిస్తున్న సీసీరోడ్లను నాణ్యతతో నిర్మించాలని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక నెహ్రూనగర్‌లోని సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. సీసీరోడ్లు నిర్మించాక క్యూరింగ్‌కు సక్రమంగా చేపట్టాలని ఆయన కాంట్రాక్టర్లకు సూచించారు.

11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

పుట్లూరు: ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతిలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఆస్మాసయోద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

పామిడి: పామిడి మోడల్‌స్కూల్‌లో ఈనెల 11న ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. మొత్తం 100 సీట్లకు గాను 208 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

రైతులందరికీ విత్తనాలు, ఎరువులు అందిస్తాం



ఎరువులు పరిశీలిస్తున్న ఏడీ రవి, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి



పెద్దవడుగూరులో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకట్రాముడు

బుక్కరాయసముద్రం: అర్హులైన రైతులందరికీ ఎరువులు, విత్తనాలు అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వ్యవసాయ శాఖ ఏడీ రవి పేర్కొన్నారు. గురువారం రేకులకుంట రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండలంలో ఎంత మంది రైతులు ఉన్నారు, ఎంత మందికి వేరుశనగ విత్తనకాయలు మంజూరు చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీ రవి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రాయితీతో ఎరువులు, విత్తనాలు అందిస్తోందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మృగశిర కార్తె ప్రారంభమైందని రైతులందరికీ వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విత్తన నాణ్యత, ఎరువులను పరిశీలించారు. డ్రోన్ పిచికారీ యంత్రాల పని తీరుపై వివరించారు. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల అకౌంట్లలో జమ చేస్తోందన్నారు. వ్యవసాయ సలహామండలి మండల చైర్మన్ కొండన్న, ఏఈఓలు పవన్, జ్ఞానజ్యోతి, ఆర్బీకే ఇన్‌చార్జి శిరీష, అనూష, రమాకాంత్, జ్యోష్ణ, కొర్రపాడు ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మహానందరెడ్డి, ఆపిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఎమ్మార్పీకే రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించాలని గుత్తి ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్ల ను పరిశీలించారు. రైతులు విత్తనాలు, మందులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నవడుగూరు ఆర్బీకేను తనిఖీ చేశారు. ప్రభుత్వం తక్కువ ధరలకే ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఏఓ మల్లీశ్వరి, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇల్లూరు ఉప సర్పంచుగా శంకర



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న శంకర

గార్లదిన్నె: ఇల్లూరు ఉప సర్పంచుగా గుజ్జుల శంకర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి వెంకటలక్ష్మి ఉపసర్పంచు ఎన్నిక నిర్వహించారు. గుజ్జుల శంకరను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు జయరాముడు, వైఎస్సార్‌సీపీ నేత శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఫీజులు తగ్గించాలని ఆందోళన

గుత్తి: రిజిస్ట్రేషన్ ఫీజులు తగ్గించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అంతకు ముందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. రిజిస్ట్రేషన్‌లు చేయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు లక్ష్మినారాయణ(లచ్చి), దాకూ చాంద్, గోపాల్, మహేష్, ఆర్‌బీ కష్ణమూర్తి, అశ్వ నాగప్ప , రంగస్వామి, శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ మార్కెట్ విలువ పెంచడం వల్ల సామాన్యులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుత్తిలో అధికంగా రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచారన్నారు.

'ఎస్కేపీ'ని పరిశీలించిన న్యాక్ బృందం

గుంతకల్లు టౌన్: స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను గురువారం ముగ్గురు సభ్యులు గల న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) బృందం పరిశీలించింది. వివిధ విభాగాలు, ల్యాబ్‌లు, కళాశాల పరిసరాలు, యూజీసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. కాగా, ఇప్పటికే రెండు సార్లు చేపట్టిన తనిఖీల్లో మొదటిసారి బీ-గ్రేడ్, రెండోసారి (బీ++) గ్రేడ్ దక్కాయని, ఈ సారి అంతకు మించిన మంచి గ్రేడ్ లభిస్తుందని అధ్యాపకులు ఆశాభావం వ్యక్తం చేశారు.